క్లుప్తంగా

స్పందన సమస్యలకు తక్షణ పరిష్కారం



పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 22 అర్జీలు రాగా అందులో ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగంపై -5, టౌన్ ప్లానింగ్‌పై-12, రెవెన్యూపై-2, ప్రజారోగ్య విభాగంపై-1, ఎస్టేట్‌పై- 2 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సంతృప్తే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, సిటీ ప్లానర్ జీవిజీ ఎస్వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) వెంకటలక్ష్మి, ఉద్యానవన విభాగం అధికారి శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఫలితాలకు ట్యాబ్‌లు దోహదం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ట్యాబ్‌లను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయటం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పుల్లో ఒకటని 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ అన్నారు. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర రాఘవ మాట్లాడుతూ చదువులో మంచి ఫలితాలను సాధించేందుకు ట్యాబ్‌లు దోహదం చేస్తాయని చెప్పారు. అదే విధంగా నాడు-నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత సీఎం జగనన్నదన్నారు. పిల్లలకు తానిచ్చే ఆస్తి విద్య ఒక్కటేనని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారని గుర్తు చేస్తూ ఆ దిశగానే ఆయన విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య మాట్లాడుతూ గత ఏడాది 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లు సత్ఫలితాలను ఇచ్చాయని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఏలూరు వెంకన్న, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు హారిక, ఉపాధ్యాయులు సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్, డీవీ మురళి ప్రసాద్, వి.రాజ్యలక్ష్మి, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై వెబినార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవాలని మేధో సంపత్తి హక్కుల నిపుణుడు నెట్టిమి సత్యసాయిశ్రీనివాస్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో మేధో సంపత్తి హక్కులపై వెబినార్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిశ్రీనివాస్ మాట్లాడుతూ మేధో సంపత్తి అనేది మానిషి తెలివితేటలకు సంబంధించిన ఆస్తిగా భావిస్తారన్నారు. వీటిపై లభించే హక్కులను చట్టపరమైన రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. మేథస్సు లేదా తెలివితేటల ద్వారా మనుషులు సృష్టించిన వస్తువులు, ఇతర కష్టార్జితంపై అన్ని హక్కులు దాని సృష్టికర్తకే ఉంటాయని చెప్పారు. వీటికి సంబంధించిన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వీటికి సంబంధించిన చాలా రకాల గుర్తింపులు ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి ఏవీ కిర్ణమయి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా రామప్రతిష్ఠ మహోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అయోధ్యలోని రామ మందిర ప్రతిష్ఠను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై సీతారామ సమేత లక్ష్మణ స్వామి, వీరాంజనేయ స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సీతారామ కల్యాణం జరిపించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మధ్యాహ్నం 12-29 గంటలకు సీతాదేవికి ఆలయ అర్చకులు స్వామి వారి తరుపున మాంగల్యధారణ చేశారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు పానకం, వడపప్పును ప్రసాదంగా పంపిణీ చేశారు. పానకం ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు బారులు తీరారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సమయంలో ఇంద్రకీలాద్రిపై ఉన్న భక్తులందరూ జై శ్రీరామ్... జైజై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. సీతారామ కల్యాణాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రికి కొత్త శోభ సంతరించుకుంది. అమ్మవారి ఆలయంలో అడుగడున మామిడి ఆకులతో తోరణాలు, అరటి చెట్లతో అందంగా తీర్చిదిద్దారు. ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన వీరాంజనేయ స్వామి వారి ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో అలకరించారు. కళ్యాణం అనంతరం ఉత్సవ మూర్తులకు ఊరేగింపు నిర్వహించగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుదీర్ఘ స్వప్నం నెరవేరింది

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): అయోధ్య రామ మందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠతో యావత్తు భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న రామభక్తుల స్వప్నం నెరవేరిందని డైమండ్ లోటస్ వాకర్స్ అసోసియేషన్ క్లబ్ అధ్యక్షుడు పల్లేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అయోధ్యలో శ్రీ బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం క్లబ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కేదారేశ్వరపేటలోని లోటస్ ల్యాండ్ మార్క్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మ్యాంగో మార్కెట్, కరుణ హోటల్ సెంటర్, రైల్వే స్టేషన్, గాంధీనగర్, బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా సాగింది. సుమారు వంద మంది క్లబ్ సభ్యులు జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ యావత్తు దేశం ఎదురు చూస్తున్న శుభ సందర్భం అన్నారు. మాజీ అధ్యక్షులు పులిపాటి వెంకట దుర్గాప్రసాద్, కె.సాయిబాబా మాట్లాడుతూ యావత్ దేశ ప్రజలు తమ ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి భక్తితో ఐదు దీపాలు వెలిగించి పూజలు చేయటం హర్షణీయమన్నారు. శ్రీ రాముడి రాక దేశ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని గుర్తు చేస్తున్నట్లుగా ఉందన్నారు. క్లబ్ సభ్యులు వంకధార ఆనంద్, శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, పానకాలు, సూర్యప్రకాష్, బసవయ్య, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఈడీ స్క్రీన్ వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

జై శ్రీరామ్ నామస్మరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): అయోధ్యలో బాల శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సుముహూర్తంలో పశ్చిమ నియోజకవర్గంలోని గట్టు వెనుక ప్రాంతంలో వాడవాడలా నిర్వహించిన వేడుకల్లో 'జై శ్రీరామ్' నామస్మరణ మార్మోగింది. విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోగల శ్రీ రామాలయంలో కమిటీ ఆధ్వర్యంలో జరిగిన విశేష పూజా కార్యక్రమాల్లో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, కమిటీ సభ్యులు దాసరి శేఖర్, పేడాడ చంద్రశేఖర్, పోలిపల్లి చిన్న, బడుగు చిన్న, కర్రి మల్లికార్జునరావు, పేడాడ రామచంద్రరావు పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ కార్యక్రమాన్ని కార్పొరేటర్ రెహమతున్నీసా ప్రారంభించారు.

వాసవి క్లబ్ భవానీపురం ఆధ్వర్యంలో...

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ వాసవి క్లబ్ భవానీపురం ఆధ్వర్యంలో భవానీపురం స్వాతి థియేటర్ వద్ద నిర్వహించిన జై శ్రీరామ్ వేడుకలు ఘనంగా జరిగాయి. పురోహితుల శాస్త్రీయ మంత్రోచ్ఛారణలతో నడుమ నిర్వహించిన విశేష పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. వాసవి క్లబ్ భవానీపురం అధ్యక్షులు అచ్యుత దిలీప్ వీఆర్ కుమార్ దంపతులు పూజలు నిర్వహించగా క్లబ్ ప్రధాన కార్యదర్శి చక్కా రవికుమార్, కోశాధికారి వాగిచర్ల రాజారావు వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శ్రీలలిత లక్ష్మీ పారాయణ భక్త బృందం సభ్యులతో హనుమాన్ ఛాలీసా పారాయణ, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 'శ్రీరామతత్వం'పై బుర్రా పద్మనాభ శర్మ ప్రవచనం చేశారు.



రామ కల్యాణం



రజిత హనుమత్ వాహనంపై కోదండరాముడు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు...

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం రామనామంతో మార్మోగింది. అయోధ్యలోని బాలరాముని ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని వాడవాడలా రాముని పూజలతో కళకళలాడింది. వీధివీధీ రామనామ సంకీర్తనలతో, పూజలతో దర్శనమిచ్చింది. బాల రాముని ప్రతిష్ఠా మహోత్సవాన్ని ప్రజలు తమ సొంత కార్యక్రమంగా జరుపుకొని ఆనందించారు. పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని ఆలయాల్లోనూ బాలరాముని ప్రతిష్ఠను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని ఆలయాల్లో కల్యాణోత్సవాలను జరపగా, మరికొన్ని ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక అలంకారాలను నిర్వహించి విశేష అర్చనలు చేశారు. కేవలం ఆలయాల్లోనే కాకుండా ప్రతి ఇంటా ఉత్సవాన్ని జరుపుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రసాదాలను పంపిణీ చేశారు.

భారీ ఎల్ఈడీ స్క్రీన్లతో ప్రత్యక్ష ప్రసారాలు

పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వార అయోధ్యలో జరుగుతున్న బాలరాముని ప్రతిష్ఠా మహోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా స్థానికులు వీక్షించే ఏర్పాట్లు చేశారు. పాతబస్తీ, బ్రాహ్మణవీధి, కొత్తపేట, మల్లికార్జునపేట తదితర ప్రాంతాల్లో పలువురు స్థానికులు, సంఘాలు, మిత్ర బృందాల ఆధ్వర్యంలో ఆయా స్క్రీన్ల ద్వారా జరిగిన కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా పందిళ్లను వేసి స్వామి వారి చిత్రపటాలను, విగ్రహాలను ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా ఆయా చోట్ల ప్రసాదాల వితరణను నిర్వహించారు. పూలతో అలంకరించిన వేదికలపై సందడి చేశారు. జైశ్రీరామ్...జైశ్రీరామ్ అంటూ నినాదాలతో ఉత్సవానికి వన్నె తెచ్చారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని పూజలు నిర్వహించారు. పాతబస్తీలోని కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లో అయోధ్య బాలరాముని ప్రతిష్ఠను పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో అఖండ రామనామసంకీర్తన నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్ మాట్లాడుతూ అయోధ్య రామమందిర నిర్మాణం చారిత్రాత్మకమన్నారు.

రజిత హనుమత్ వాహనంపై స్వామివారు

కొత్తగుళ్లలోని శ్రీ కోదండరామాలయంలో స్వామి వారి ఉత్సవమూర్తులను రజిత హనుమత్ వాహనంపై అధిష్ఠింపజేసి పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేకంగా స్వామి వారికి వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సాయంత్రం రామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం హనుమత్ ఉపాలయంలో పూజలు నిర్వహించారు.



విద్యాధరపురం రామాలయంలోని పూజల్లో కార్పొరేటర్ రెహమతున్నీసా తదితరులు



ఇంద్రకీలాద్రిపై కల్యాణం చేస్తున్న అర్చకులు



వాసవి క్లబ్ భవానీపురం పూజలు



పానకం తీసుకునేందుకు బారులు తీరిన భక్తులు



కృష్ణవేణి మార్కెట్ వద్ద శ్రీరామనామసంకీర్తన

జగనన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్.ఆసిఫ్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్.ఆసిఫ్ తెలిపారు. నియోజకవర్గంలోని 34వ డివిజన్ కేదారేశ్వరపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ గత రెండు శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించిందన్నారు. ఈ సారి కూడా పార్టీ విజయఢంకా మోగించి హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పార్టీని గెలిపిస్తుందన్నారు. కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, కార్యకర్తలను సమష్టిగా కలుపుకుని పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చిన తరువాత నియోజకవర్గంలో కొట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. అన్ని డివిజన్‌లలో రొడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయం కల్పించామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా శాసనసభ స్థానాన్ని కచ్చితంగా గెలుస్తామన్నారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు, డివిజన్ కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల మాట్లాడుతూ అయోధ్యలో బాల రాముడి ప్రతిష్ఠ జరుపుకుంటున్న రోజునే ఈ కార్యక్రమంను చేపట్టటం సంతోషంగా ఉందన్నారు. తోలేటి శ్రీకాంత్, మనోజ్ కొఠారి, జమలపూర్ణమ్మ, గౌస్‌మోహిదీన్, కార్పొరేటర్లు బుల్లా విజయ్‌కుమార్, చైతన్యరెడ్డి, యలకల చలపతిరావు, మండెపుడి ఛటర్జి, అంజనేయరెడ్డి, అబ్దుల్ అర్షద్, నాయకులు తంగెళ్ల రాము, మైలవరపు దుర్గారావు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కేదారేశ్వరపేటలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఆసిప్, భాగ్యలక్ష్మి, పుణ్యశీల తదితరులు

దుర్గమ్మ సన్నిధిలో ఆంధ్ర నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయంకు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన ఆంధ్ర నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నృత్యాలయానికి చెందిన అంజలి, పూజిత, హేమ, రేష్మా, పూజ, భవ్యశ్రీ, శ్రావణిలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందచేశారు.

యువతకు అన్ని రంగాల్లో ఉద్యోగావకాశాలు

కోల్ ఇండియా సంస్థ చైర్మన్ మల్లికార్జున ప్రసాద్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతకు అన్ని రంగాల్లోనూ ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉన్నాయని కోల్ ఇండియా సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పోలవరపు మల్లికార్జున ప్రసాద్ (పీఎం.ప్రసాద్) అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో సహజ వనరు బొగ్గు గనుల నిర్వహణ-ఉత్పాదన శక్తి అనే అంశంపై కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో సోమవారం సదస్సు నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ మన దేశంలో యువత నైపుణ్యాలు పెంచుకుంటే ఎక్కడైనా ఉద్యోగాలు పొందవచ్చునని చెప్పారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇండియన్ రైల్వే సంస్థ తర్వాత రెండవ అతిపెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నది కోల్ ఇండియా లిమిటెడ్‌లోనే అని చెప్పారు. తమ సంస్థలో రెండులక్షల 35 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది 780 మెట్రిక్ టన్నుల బొగ్గును ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించుకున్నామని అది సాధించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ద్వారా పోటీ ప్రపంచంలో ముందంజ వేస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను తమ సంస్థ సాధిస్తుందని చెప్పారు. ప్రైవేటు రంగ సంస్థలకు కూడా ఈ బొగ్గు ఉత్పత్తిలో పాల్గొనే అవకాశాన్ని భారత ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా కోల్ ఇండియా సంస్థ తరపున దేశం వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలకు నిర్వహించామన్నారు. పర్యావరణ సమతుల్యత పాటిస్తూ ఉద్యోగుల భద్రత, సంక్షేమ కార్యక్రమాలకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లుగా వెల్లడించారు. డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి. జంపాలా మాట్లాడుతూ ప్రసాద్ స్వస్థలం చీరాల ప్రాంతం అని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆర్.సాంబిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ బి.జయప్రకాష్, డాక్టర్ ఎస్‌బీ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, డాక్టర్ ఎండీ ఎస్ రెహమాన్, డాక్టర్ జె.దుర్గాప్రసాద్‌లు కలిసి అతిథి ప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు.



మల్లికార్జున ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

త్వరలో మెట్ల మార్గం నుంచి రాకపోకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ వాసులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న దుర్గగుడి మల్లికార్జునపేట మెట్ల మార్గంలో రాకపోకలు త్వరలో ప్రారంభం కానున్నాయి. మల్లికార్జునపేట ఉప్పరవాగు ప్రాంతం నుంచి అమ్మవారి ఆలయానికి మెట్ల మార్గం ఉంది. అయితే కొన్నేళ్లుగా ఆలయ అధికారులు అమ్మవారి దేవస్థానానికి ఈశాన్యంలో ఉన్న ఈ మెట్ల మార్గాన్ని భద్రతా కారణాలు చూపి మూసివేశారు. దీంతో వన్‌టౌన్, కొత్తపేట, చిట్టినగర్, సాయిరాం ప్రాంతాలకు చెందిన వారు అమ్మవారిని దర్శించుకోవాలంటే చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దుర్గగుడి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్నాటి రాంబాబు ఈ మెట్ల మార్గాన్ని తిరిగి తెరవాలని ప్రతిపాదన చేశారు. దీంతో ఆలయ అధికారులు ఈ మెట్ల మార్గాన్ని తిరిగి తెరిచేందుకు అవసరమైన పనులు చేపట్టారు. గత రెండు రోజులుగా మెట్ల మార్గాన్ని శుభ్రం చేయించడంతో పాటు భక్తులు రాకపోకలు సాగించేందుకు అనువుగా తీర్చిదిద్దారు. మెట్ల మార్గం వద్ద సెక్యూరిటీ సిబ్బందితో పాటు శానిటేషన్ సిబ్బందికి ఆలయ ఏఈవో చంద్రశేఖర్ విధులు కేటాయించారు. సోమవారం మెట్ల వద్ద పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఇప్పటికే మెట్ల మార్గం ద్వారా భక్తుల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఒకటి , రెండు రోజుల్లో ఆలయ చైర్మన్, ఈవోలు ఈ మార్గాన్ని లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉందన్నారు.



సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏఈవో చంద్రశేఖర్

అంతా రామమయం..



అయోధ్యలో రామాలయం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా బెజవాడ నగరంలో సోమవారం రామనామం మార్మోగింది. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్ అంటూ భక్తులు ఆధ్యాత్మిక భావనలో మునిగిపోయారు. రామమయం... జగమంతా రామమయం అంటూ గీతాలు ఆలపించారు. రామమందిర ప్రతిష్ఠను పురస్కరించుకొని వాడవాడలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











ముగిసిన అయోధ్య రామనామ సంకీర్తనం

విజయవాడ కల్చరల్: లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, సామగాన లహరి సాంస్కృతిక సంస్థ దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అయోధ్యరామయ్య సంకీర్తనోత్సవ కార్యక్రమాలు సోమవారం ముగిసాయి. నాగలక్ష్మి, సింధురాగేశ్వరి బృందం రావయ్య భద్రాదిరామ, ఇదుగో భద్రాది, తారక మంత్రము కీర్తనలు మధురంగా ఆలపించారు.